

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
శుక్రవారం 31 అక్టోబరు 2025





నేడు సీఎం రాక

- నీట మునిగిన నగరంలో ఏరియల్ సర్వే
- పలు ప్రాంతాలను సందర్శించనున్న సీఎం
- కలెక్టరేట్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారులతో సమీక్ష



6



ఆగమాగం

- తుపాన్‌తో పొంగుతున్న వాగులు, వంకలు
- పలు గ్రామాలకు రాకపోకల బంద్
- ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల వాగు
- వరి పొలాలపై ఇసుక మేటలు
- నష్టపోయిన పంటలను పరిశీలించిన పాలకుర్తి ఎమ్మెల్యే



మానుకోటలో ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు



కేసముద్రం ఈద్గా వద్ద వరదలో చిక్కుకున్న బస్సులోని ప్రయాణికులను జేసీబీ ద్వార దాటిస్తున్న పోలీసులు

మహబూబాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాన్ ప్రభావంతో జిల్లాలో కురిసిన అతి భారీ వర్షాలకు, ఎగువన కురిసిన వానలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మహబూబాబాద్, డోర్నకల్, కురవి, కేసముద్రం మండలాల్లోని వాగులు పొంగిపొర్లుతుండడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. చిన్నగూడూరులో ఉధృతంగా ప్రవహిస్తున్న ఆకేరువాగును మాజీమంత్రి డీఎస్.రెడ్యానాయక్ పరిశీలించగా.. తొర్రూరు, పెద్దవంగర మండలాల్లో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పర్యటించి పరిశీలించారు. కేసముద్రం ఈద్గా దర్గా వద్ద మూడు ఆర్టీసీ బస్సులు చిక్కుకోగా, అందులో ఉన్న 21 మంది ప్రయాణికులను పోలీసులు జేసీబీ సాయంతో సురక్షితంగా అవతలి ఒడ్డుకు చేర్చారు. మరిపెడ మండలం సీతారాంతండాలో గతేడాదిలో తుపాన్‌లు ముంచివేయడంతో అప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చి పలు వాగ్దానాలు చేసి, వెళ్లిపోయారు. ఆ వాగ్దానాలు ఇప్పటికి నేరవేర్చలేదని, వాటిని నేరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆ తండా గిరిజనులు రోడ్డుపై బైఠాయించి 3 గంటల పాటు ధర్నా నిర్వహించారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గూడూరు మండలంలో మేతకు వెళ్లిన 58 గొర్రెలు తుపాన్ ప్రభావం తాకిడికి తట్టుకోలేక మృతి చెందడంతో గొర్రెల కాపరులు కన్నీరు.. మున్నీరవుతున్నారు.



గూడూరులో గాజులగట్టులో ఇంటి గోడ కూలి మృతి చెందిన రామక్క

జిల్లా వ్యాప్తంగా ఇలా..

బయ్యారం మండలం పాకాల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈదుల చెరువు వద్ద వరి పంటపొలాలు మునిగిపోయాయి. మండలంలోని అన్ని చెరువులు అలుగులు పడ్డాయి. డోర్నకల్ మండలంలో మున్నేరు, ఆకేరువాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఉయ్యాలవాడ వద్ద 365/1 జాతీయ ఆకేరువాగు వరదనీరు ప్రవహిస్తుండడంతో ఖమ్మం-మహబూబాబాద్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. పత్తి, వరి, మిర్చి పంటలతో పాటు కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. గాలం బాబు, లక్ష్మి, వెంకన్న, మధుకు చెందిన వరి పొలాలు మున్నేరువాగులో మునిగిపోయాయి. కొన్ని వరిపొలాలు ఇసుక మేటలు వేశాయి. చిన్నగూడూరులో ఆకేరువాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. వాగులో ఉన్న గంగమ్మగుడి, పెద్దమ్మ గుడులు సైతం మునిగిపోయాయి. మాజీ మంత్రి డీఎస్.రెడ్యానాయక్ వాగు వద్దకు వచ్చి పరిశీలించి రైతులకు తగు జాగ్రత్తలు సూచించారు.




గూడూరులో తుపాన్ ప్రభావంతో మృతి చెందిన గొర్రెలు

వడ్డెర కాలనీలోకి వరదనీరు

కేసముద్రం మండలంలో ఈద్గా వద్ద వరదనీటిలో చిక్కుకుపోయిన మూడు ఆర్టీసీ బస్సుల్లో ఉన్న 21 మంది ప్రయాణికులను కేసముద్రం ఎస్సైలు క్రాంతికిరణ్, నరేష్‌లో పాటు సిబ్బంది రాజు, ఆలీం, రామకృష్ణ కలిసి పొక్లెయిన్ తీసుకువచ్చి దాని సాయంతో వరదనీటి నుంచి పొక్లెయిన్ బకెట్‌లలో ప్రయాణికులను కూర్చొబెట్టి వాగు దాటించారు. అనంతరం వారికి గ్రామపంచాయతీలో వసతితో పాటు భోజనం ఏర్పాటు చేశారు. అర్పనపల్లి వద్ద వట్టివాగు ఉధృతంగా (మిగతా 8లో..)



మత్తడి పోస్తున్న బయ్యారం పెద్ద చెరువు అలుగు



మరిపెడ మండలంలోని పురుషోత్తమయగూడెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఆకేరువాగు



కొత్తగూడ మండలం పొగుళ్లపల్లిలో నీటిలో మునిగిన వరి

ముంచిన 'మొంథా'

- తుపాన్‌తో చేతి కొచ్చిన పంట నీటి పాలు
- విరిగిన స్తంభాలు.. దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు
- జిల్లాలో 26,029 ఎకరాల్లో పంట నష్టం

8



చిన్నగూడూరు ఆకేరువాగులో మునిగిన గంగమ్మ, పెద్దమ్మ గుడులు

బయ్యారం పెద్ద చెరువు పరవళ్లు

బయ్యారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కాకతీయుల నాటి బయ్యారం పెద్ద చెరువు మత్తడి గురువారం మరోమారు పరవళ్ల తొక్కుతుంది. మొంథా తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు 16.03 అడుగుల సామర్థ్యం కలిగిన చెరువులోకి 20 అడుగుల మేర నీరు చేరింది. దీంతో నాలుగు అడుగుల ఎత్తుతో అలుగు పోస్తోంది. కాగా, గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది విస్తారంగా కురుస్తున్న వర్షాలకు చెరువు చాలాసార్లు మత్తడి పారుతోండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.











బతికుండగానే మార్చురీకి తరలించారు...

- అచేతన స్థితిలో ఉన్న వ్యక్తి విషయంలో ఆస్పత్రి సిబ్బంది పొరపాటు
- 24 గంటల తర్వాత శరీరంలో కదలికలు గుర్తించిన సిబ్బంది
- పోలీసుల జోక్యంతో ఎమర్జెన్సీ వార్డుకు తరలించి చికిత్స
- మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో ఘటన



చికిత్స పొందున్న జయ్యారం వాసి ఎల్లి రాజు

నెహ్రూసెంటర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వైద్యం కోసం వచ్చిన ఓ రోగికి ఆధార్‌కార్డు లేదని దవాఖానలో చేర్చుకోకుండా తిరస్కరించిన సిబ్బంది.. రెండు రోజుల తర్వాత అపస్మారక స్థితిలో వున్న అతడిని చనిపోయాడని భావించి మార్చురీ ఆవరణకు తరలించారు. అయితే 24 గంటల తర్వాత స్వీపర్, సెక్యూరిటీ గార్డు అతడిలో కదలికలు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఎమర్జెన్సీ వార్డుకు తరలించారు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం వెలుగుచూసింది. బాధితుడైన ఎల్లి రాజు, వైద్యసిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం జయ్యారంకు చెందిన ఎల్లి రాజు ఒంటరిగా ఉంటూ ట్రాక్టర్ డ్రైవర్‌గా కొంత కాలం పని చేశాడు. ఆపై నడుమునొప్పి, మోకాళ్ల నొప్పులతో (మిగతా 8లో..)

ధాన్యం సేకరణకు ప్రాధాన్యం ఇవ్వాలి

వీసీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ధాన్యం సేకరణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచనలు చేశారు. గురువారం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, వాకటి శ్రీహరి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ధాన్యం సేకరణ కేంద్రాల వద్ద సివిల్ సప్లై అధికారులు ఎప్పటికప్పుడు సూచనలు చేయాలన్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రం వద్ద మండలస్థాయి అధికారిని ప్రత్యేకంగా నియమించాలన్నారు. అవసరమైన చోట ధాన్యాన్ని దగ్గర్లో ఉన్న ఫంక్షన్‌హాల్‌కు తరలించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ 24 గంటలకు పరిస్థితిపై కలెక్టర్‌కు అధికారులు రిపోర్టు అందించాలన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని, అవసరం ఉన్న చోట ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాల సేవలను వినియోగించుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, అనిల్‌కుమార్, ఆర్డీవోలు కృష్ణవేణి, గణేష్, జిల్లా అధికారులు విజయనిర్మల, పురుషోత్తం, హరిప్రసాద్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

మాధవపురంలో ఘటన 8



వాహనదారులు లైసెన్సు కలిగి ఉండాలి

పెద్దవంగర, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వాహనదారులకు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని ఎస్సై చిలువేరు ప్రమోద్‌కుమార్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ హెల్మెట్, లైసెన్స్ లేని పలువురు వాహనదారులకు జరిమానా విధించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనం నడిపేతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ వ్యాపారాలు చేపడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట ఏఎస్సై హిదాయాత్‌అలీ, సుధాకర్ ఉన్నారు.

గ్రామాల్లో సత్వరమే క్లోరినేషన్ చేపట్టాలి

దంతాలపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో గ్రామాల్లో సత్వరమే క్లోరినేషన్ ప్రక్రియను ప్రారంభించాలని ఎంపీడీవో విజయ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ శానిటేషన్, క్లోరినేషన్‌తో పాటు రక్షిత తాగునీటి బావులను శుభ్రపర్చాలని సూచించారు. బావుల్లో కలుషితమైన తాగునీటిని బయటికి తీయాలన్నారు. పైప్‌లైన్ లీకేజీలను పూర్తిచేసి మండల ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జీపీ సిబ్బందిచే ప్రతి రోజు వీధుల్లో పరిశుభ్రత కోసం చర్యలు తీసుకోవాలన్నారు. లేనిచో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందన్నారు. సమావేశంలో మండలపంచాయతీ కార్యదర్శులు ఏశబోయిన వెంకన్న, మధు, మల్లికార్జున్, మమత, సృజన, భూలక్ష్మి, వెంకన్న, శ్రీకాంత్, నాగార్జున, మురళి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పెద్దవంగర, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి ఎకరానికి రూ.25వేలు చెల్లించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థానం మాజీ చైర్మన్ వి.రామచంద్రయ్యశర్మ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో భారీ వర్షాలతో దెబ్బతిన్న వరి పంటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తడిసిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేయాలని, ధాన్యం కొనుగోలులో ఎటువంటి జాప్యం లేకుండా కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలను కల్పించాలన్నారు. ప్రభుత్వం తక్షణమే గ్రామాలలో అధికారులతో నష్టం అంచనా వేసి రైతులకు పరిహారం అదించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కనుకుంట్ల వెంకన్న, సల్దేండి సుధాకర్, విజయ్‌పాల్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, మహిపాల్‌రెడ్డి, అనపురం రవి, భిక్షపతి, వెంకన్న, శంకర్, నారాయణ, బొల్లు సతీష్, శేఖర్‌వర్మ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలి



మరిపెడలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మరిపెడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కళాశాలలకు బకాయి పడిన ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా బాధ్యులు గందసిరి జ్యోతిబసు, పట్ల కిరణ్ డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో మరిపెడలోని స్కూల్స్ కళాశాలల విద్యార్థులు తరగతులను బహిష్కరించి స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఎస్ఎఫ్ఐ నేతలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జ్యోతిబసు, కిరణ్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం విడుదల చేయకుండా కళాశాలల యాజమాన్యాలను, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఓవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో కళాశాలలను మూసి వేస్తామని ప్రైవేటు విద్యాసంస్థలు చెబుతున్నా ప్రభుత్వానికి ఉలుకుపలుకు లేదన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథ తుఫాన్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం రాత్రి అకాలంగా కురిసిన వర్షాలతో మండలంలో పంటలు, రహదారులు, ఇళ్లు ధ్వంసం అయ్యాయి. అమ్మాపురం గ్రామ శివారు బొత్తలతండా వద్ద ధ్వంసమైన కల్వర్టు, గుర్తూర్-సోమారం గ్రామాల మధ్య ఉధృతం ప్రవహిస్తున్న ఈదులకుంటవాగును, గుర్తూర్‌లో నీటమునిగిన పంటలను గురువారం ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, నష్టం అంచనా వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎస్సై ఉపేందర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకల కుమార్, కందాడి అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, పెద్దగాని సోమయ్య, మంగళిపల్లి రామచంద్రయ్య, ఎం.విక్రమ్‌రెడ్డి, మోత్కూరి రవీంద్రచారి, అరవింద్ పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రతీ ఒక్కరిని ఆదుకుంటాం..

పెద్దవంగర(ఆంధ్రజ్యోతి): మొంథ తుఫాన్ ప్రభావంతో నియోజకవర్గ ప్రజ


పెద్దవంగరలో నీటి ప్రవాహంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


గుర్తూర్‌లో నీట మునిగిన వరిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

లు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, ముంపుప్రాంతాల్లో ఉన్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి మండల కేంద్రం జలదిగ్బంధంలో ఉండిపోయింది. వరద ప్రవాహం దాటికి దెబ్బతిన్న వ్యవసాయ పొలాలను ఆయా శాఖల అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నష్టపోయిన ప్రతీ ఒక్కరిని అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుటుందన్నారు. నష్టం అంచనా వేసి ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలన్నారు. విపత్కర పరిస్థితుల్లో గ్రామాల్లోని నాయకులు, ప్రజాప్రతినిధులు బాధితులకు అండగా నిలిచి చేయూతనివ్వాలన్నారు. తడిసిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీరగంటి మహేందర్, ఎంపీడీవో వేణుమాధవ్, ఆర్ఐ లష్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, రంగు మురళి, వెంకన్న, రవీందర్‌రెడ్డి, దేవేంద్ర, ఉప్పలయ్య, లింగమూర్తి, సీతారామ్, హరికృష్ణ, సోమన్న, సంపత్, సైదులు, శ్రీనివాస్, మంజుల, వినోద్, సమ్మయ్య, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పాలేరు వాగు వద్ద బారికేడ్లు

దంతాలపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దముప్పారం గ్రామ శివారు పాలేరు వాగు రెండు రోజులుగా ఉధృతంగా ప్రవహిస్తుండడంతో స్థానిక ఎస్సై పిల్లల రాజు ఆధ్వర్యంలో భారీ బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉందన్నారు. రైతులు, ప్రయాణికులు వాగులు దాటేందుకు సాహసం చేయొద్దన్నారు. 24 గంటల పాటు పోలీసు సిబ్బంది, ఆయా గ్రామాల జీపీ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. దీంతో సూర్యాపేట-దంతాలపల్లికి ఆర్టీసీ సౌకర్యాన్ని నిలిపివేశారు. కుమ్మరికుంట్ల వద్ద పాలేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో పంచాయతీ కార్యదర్శి సృజన పలు సూచనలు చేశారు.

'నష్టం నివేదికను పంపిస్తాం'

దంతాలపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మూడు రోజులుగా కురుస్తోన్న తుఫాన్ వల పంటలకు తీవ్ర నష్టం జరిగిందని, రైతులకు న్యాయం జరిగేందుకు ప్రభుత్వానికి నివేదికను పంపిస్తామని ఏవో వాహిని అన్నారు. గురువారం ఆమె ఆధ్వర్యంలో మండలంలోని ఆగపేట, నిదానపురం, పెద్దముప్పారం, తూర్పుతండా, గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 గ్రామాల్లోని రైతుల పొలాలను ఉన్నతాధికారుల సూచన మేరకు పరిశీలించి నిదికను తయారు చేస్తామన్నారు. మరో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. సాహసం చేసి వాగులు, వంకలు దాట్వొద్దన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు దీక్షిత్‌కుమార్, ఉదయ్‌కిరణ్, శిరీష పాల్గొన్నారు.

ఉప్పొంగిన ఆకేరు వాగు

● ఆందోళన చేపట్టిన గిరిజనులు

● గత ఏడాది సీఎం ఇచ్చిన హామీలు వట్టిమాటేనా..?

మరిపెడ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఆగస్టులో కురిసిన తుఫాన్ తాకిడి నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఆకేరు పరివాహక ప్రాంతాలైన పురుషోత్తమాయగూడెం శివారు సీతారాం తండా, ఉల్లేపల్లి, బీచ్‌రాజ్‌పల్లి, భూక్యా తండాలలో బుధవారం ఉదయం మొదలై సాయంత్రం వరకు కురిసిన మొంథా తుఫాన్‌తో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. గురువారం ఉదయం ఒక్కసారే ఆకేరు వాగు ఉప్పొంగడంతో సీతారాం తండా వాసులు పురుషోత్తమాయగూడెం వద్ద ఉన్న పెట్రోల్ బంక్ వద్ద రెండు గంటల పాటు ఆందోళన చేపట్టారు.

జాతీయ రహదారిపై గిరిజనుల ఆందోళన

సీతారాం తండాకు సమీపంలో ఉన్న ఆకేరు వాగు ఉధృతి పెరగటంతో తండా వెనుక వైపు పంట చేలల్లో నీళ్లు చేరాయి. అదే విధంగా జాతీయ రహదారి 365పై నుంచి తండాకు వచ్చే దారిలో నీరు రోడ్డుపైకి చేరుతుండడంతో మరోసారి ఏం జరుగుతుందోనన్న భయాందోళనలతో తండా వాసులు ప్రధాన రహదారిపైకి వచ్చి అధికారుల కోసం ఎదురు చూస్తున్నారు. జాతీయ రహదారిపై ఉన్న పెట్రోల్ బంక్ వద్ద పశువులను కట్టేసి.. రాత్రంతా జాగారం చేసినట్లు తండా వాసులు పేర్కొన్నారు..

సీఎం రేవంత్‌రెడ్డి హామీలు వట్టిమాటలేనా..

గత ఏడాది వచ్చిన అకాల వర్షాలకు తమ తండా మొత్తం మునిగిపోయింది. ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి స్వయాన తండాకు వచ్చి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. గురువారం తెల్లవారుజాము నుంచి వరద ఉధృతి పెరిగినా అధికారులు ఎవరూ మమ్మల్ని సంప్రదించలేదని తండా వాసులు వాపోయారు.స్థానిక ఎమ్మెల్యే రామచంద్రునాయక్, ప్రభుత్వం చొరవ తీసుకుని తండాకు సమీపంలో ఆకేరు వాగుకు దూరంలో 64 ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామన్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్లను కట్టించాలని డిమాండ్ చేశారు.దీంతో తహసీల్దార్ కృష్ణవేణి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూస్తున్నామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

● తొర్రూరు రూరల్(ఆంధ్రజ్యోతి): మండలంలో మొంథా తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంది. అమ్మాపురంలో చేతికి వచ్చిన వరి పంట నీట మునిగిపోయి వరద ప్రవహిస్తోంది. సోమారం గ్రామంలో ఒక ఇల్లు, అమ్మాపురం గ్రామాల్లో ఇల్లు కూలిపోయినట్లు అధికారులు వెల్లడించారు. ఈదులకుంటతండా వద్ద వరద ఉధృతంగా ప్రవహించడంతో నర్సంపేట-తొర్రూరు రాకపోకలు నిలిచిపోయాయి. కంఠాయపాలెం గ్రామం నుంచి కస్నాతండాకు వెళ్లే రహదారి కొట్టుకుపోయింది. కొమ్మనపల్లితండాలో రహదారి పూర్తిగా ధ్వంసమైంది. గుర్తుర్-కంఠాయపాలెం మధ్య వరద ఉధృత్తితో రాకపోకలు నిలిచిపోయాయి. వెంకటాపురం గ్రామంలో గాలివానకు విద్యుత్ స్తంభం విరిగి గాదెగాని వెంకన్న ద్విచక్ర వాహనం ధ్వంసమైంది. మండల వ్యాప్తంగా 1500 హెక్టార్లలో పంటల నష్టం అంచనా వేసినట్లు తెలిపారు. నాంచారిమడూరు, వెల్లికట్టె గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఎస్‌వో ప్రేమ్‌సాగన్, డీఎం కృష్ణవేణి పరిశీలించారు.


పురుషోత్తమాయగూడెం వద్ద ఆందోళన చేస్తున్న గిరిజనులు


అమ్మాపురంలో వరి పంటలో నుంచి ప్రవహిస్తున్న వరదనీరు

నేడు సీఎం రాక..

» నీట మునిగిన నగరంలో ఏరియల్ సర్వే
» పలు ప్రాంతాలను సందర్శించనున్న సీఎం
» కలెక్టరేట్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలతో సమీక్ష

వరంగల్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మొంథా తుఫాన్‌తో జలమయమైన వరంగల్ నగరాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందర్శించనున్నారు. తుఫాన్‌తో వరంగల్ నగరంలోని అనేక కాలనీలు నీటమునగగా రోడ్లు, పంటలు భారీగా దెబ్బతిన్నాయి. ఈక్రమంలో గురువారం జిల్లా అధికారులు మంత్రి కొండా సురేఖతో కలిసి వర్షాల కారణంగా జరిగిన నష్టాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశిస్తూనే శుక్రవారం వరంగల్ నగరాన్ని సందర్శించనున్నట్లు సీఎం పేర్కొన్నారు. తొలుత వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని పలు ప్రాంతాలను ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. అనంతరం హనుమకొండ, వరంగల్ పట్టణాల్లోని నీట మునిగిన పలు కాలనీలను సీఎం సందర్శించి బాధితులతో మాట్లాడనున్నారు. లోతట్టు ప్రాంతాల్లో బాధితులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను సీఎం పరిశీలించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2గంటలకు హనుమకొండ కలెక్టరేట్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్షించనున్నారు. నగరంలో వరదలకు, లోతట్టు ప్రాంతాలు నీటమునగడానికి గల కారణాలపై సమీక్షించనున్నారు. భవిష్యత్‌లో వరంగల్ నగరానికి వరద ముప్పు లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధికారులతో చర్చించనున్నారు. ఇప్పటికే నగరంలో రూ.5170కోట్లతో అండర్ డ్రైనేజీ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం ఈ పనులకు సంబంధించిన పురోగతిపై సీఎం చర్చించనున్నారు. కాగా, సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. అయితే సీఎం పర్యటన అధికారికంగా ఖరారు కావాల్సి ఉంది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

వీసీ ద్వారా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

జనగామ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ రైతులకు అండంగా నిలువాలని వీసీ(వీడియో కాన్ఫరెన్స్) ద్వారా సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల జిల్లా కలెక్టర్లతో గురువారం డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కొండ సురేఖ, వాకటి శ్రీహరి, సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. జనగామ కలెక్టరేట్ కార్యాలయం నుంచి కలెక్టర్ రిజ్వాన్ బాషా, సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ తుఫాన్ ప్రభావిత జిల్లా ఇన్‌చార్జీ మంత్రులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. 16 జిల్లాలకు తుఫాన్ ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సెలవులను రద్దు చేయాలన్నారు. అవసరమైన చోట్ల వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాగులు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజలను అప్రమత్తం చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలుపై స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. ధాన్యం కొనుగోలుపై కలెక్టర్ సంబంధిత అధికారులతో వీసీ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు నష్టం కాకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలన్నారు. నవంబరు మొదటి వారంలో మరింత ధాన్యం వచ్చే అవకాశం ఉందని ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయిలో వేగవంతం జరగాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కంట్రోల్ రూమ్ నంబర్లను ఏర్పాటు చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

సింగరేణి సీఎండీ వీడియో కాన్ఫరెన్స్

కృష్ణకాలనీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో జరుగతున్న విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా దాని ప్రాముఖ్యతపై ఆ సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ నాయక్ గురువారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భూపాలపల్లి ఏరియా అధికారులతో మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించకుంటూ పారదర్శక సేవలు అందించడం ద్వారా అవినీతిని కట్టడి చేయడానికి ఆస్కారం ఉంటుందన్నారు. విజిలెన్స్ అంటే ప్రతి ఒక్కరినీ నేరస్థులుగా చూడ్డం కాదని స్పష్టం చేశారు. నేరం జరగకుండా వ్యవస్థను పకడ్బందీగా నిర్వహించడమేనని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి, ఎస్‌వోటూ జీఎం కవీంద్ర, అధికారులు ఎర్రన్న, జ్యోతితి, రవీందర్, రాజేశ్వర్, శైలేంద్రకుమార్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

ములుగు రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన ములుగు మండలం జగ్గన్నపేట గ్రామపంచాయితీ పరిధి సారంగపల్లిలో గురువారం చోటుచేసుకుంది. బాధిత రైతు అజ్మీరా అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం ఇంటి నుంచి మేతకు వెళ్లిన గేదె గ్రామంలోని ఆశ్రమ కళాశాల ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభం ఎర్త్ వైర్లు తగిలి షాక్‌కు గురై మృతి చెందింది. దీంతో రూ. 60 వేలు నష్టం జరిగిందని అనిల్ తెలిపాడు.

మేడిగడ్డ బ్యారేజీకి స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. మొంథా తుఫాన్ ప్రభావంతో ఇన్‌ఫ్లో నెమ్మదిగా పెరుగుతోంది. నెలరోజులుగా బ్యారేజీలోకి ఇన్‌ఫ్లో 1.23లక్షల క్యూసెక్కులుగా ఉండగా, గురువారం 1.75లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. బ్యారేజీ వద్ద 3 మీటర్ల ఎత్తులో గోదావరి ప్రవహిస్తోంది.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

మల్హర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : ఉరి వేసుకొని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి జిల్లా మల్హర్ మండల కేంద్రమైన తాడిచర్లలో గురువారం చోటు చేసుకుంది. కొయ్యూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం జడల్‌పేట గ్రామానికి చెందిన గొడిశెల విజయేందర్(30) కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 27న అతడితో గొడవ పడిన భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురై న విజయేందర్ ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య స్వప్న ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

'మంథని' అభివృద్ధి కాంతులు

● నియోజకవర్గంపై మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక ఫోకస్ ● ఇప్పటికే అనేక పనులకు శ్రీకారం
● చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుపై దృష్టి ● గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ప్రణాళిక

మహదేవపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మంథని నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. అనేక ఏళ్లుగా తిష్ట వేసిన సమస్యలకు పరిష్కారం లభిస్తోందని సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రగతి వైపు పరుగులు పెడుతున్నామని అంటున్నారు ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తూ మంత్రిగా కొనసాగుతున్న దుద్దిళ్ల శ్రీధర్‌బాబు. కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక కృషితో చిన్న కాళేశ్వరం పనులకు రూ.513 కోట్లకు పైగా నిధులు వెచ్చిస్తున్నామని అంటున్నారు. నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ, ఇతర అభివృద్ధి పనులను ముమ్మరం చేసినట్టు తెలిపారు. అలాగే సంక్షేమ పథకాలను నియోజకవర్గంలో సమర్థంగా అమలు చేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు అంటున్నారు. ముఖ్యంగా సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణలక్ష్మి ఇతరత్రా పథకాలతో పేదలకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు.

- గోదావరి పుష్కరాలకు రూ. 200 కోట్లు

గోదావరి పుష్కరాలు 2027లో జరగనున్న నేపథ్యంలో రూ. 200 కోట్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. కొన్ని నెలల క్రితం జరిగిన సరస్వతీ పుష్కరాలకు రూ.33 కోట్లు కేటాయించారు.

చిన్న కాళేశ్వరం పనులకు నిధులు

రైతులకు సాగు నీరు అందించే చిన్న కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను పునఃప్రారంభించేందుకు మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక దృష్టి సారించారని తెలుస్తోంది. పదేళ్ల క్రితం అర్ధంతరంగా ఈ ప్రాజెక్టు పనులు ఆగిపోగా దానిని పూర్తి చేయడానికి రూ. 513 కోట్లు వెచ్చిస్తున్నారు. అంతేకాకుండా గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, విస్తరణ పనులు చేపట్టి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరుస్తున్నామని మంత్రి తెలిపారు.


మహదేవపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు (ఫైల్)

-కాళేశ్వరాలయ అభివృద్ధికి కృషి

శ్రీధర్‌బాబు స్వగ్రామం భూపాలపల్లి జిల్లా కాటారం మండల పరిధి ధన్వాడ. మాజీ మంత్రి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు తనయుడు ఆయన. తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రజా సేవ చేయడమే తన కర్తవ్యమని అంటున్నారు శ్రీధర్‌బాబు. మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరాలయం నిర్మాణంలో తండ్రి శ్రీపాదరావు ప్రధాన పాత్ర పోషించారని స్మరించుకున్నారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా కాళేశ్వరాలయం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని అంటున్నారు. ఇందులో భాగంగా గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగుతున్నానని తెలిపారు.



జలమయమైన హంటర్‌రోడ్‌లోని భద్రకాళి బండ్ జంక్షన్

వరదనీళ్లలో ఓరుగల్లు



చిన్నారులను తరలిస్తున్న రెస్క్యూ సిబ్బంది



గోపాల్‌పూర్ చెరువు వరద నీరు ముంచెత్తడంతో జవహర్ కాలనీలో వరదనీటి మధ్యలో ఇళ్లు



జవహర్‌కాలనీలో నీటిలో మునిగిన కారు



పెద్దమ్మగడ్డ నాలా వద్ద వరదనీరు ప్రవహిస్తుండడంతో భారీగా పేరుకుపోయిన వాహనాలు



భారీ వర్షానికి వరంగల్ నగరంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న నాలా, వరదనీటిలో మునిగిపోయిన పలు కాలనీలు

మృత్యు వరద

మొంథా తుఫాన్‌తో ఉమ్మడి జిల్లాలో ఆరుగురి మృతి

మొంథా తుఫాన్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో తీవ్ర ప్రభావం చూపింది. వర్షానికి పలు ప్రాంతాల్లో ఆరుగురు మృత్యువాత పడ్డారు.

వరదనీటిలో చిక్కుకుని వృద్ధుడి మృతి



ఆడెపు క్రిష్ణమూర్తి

వరంగల్‌సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో 14వ డివిజన్ ఎస్‌ఆర్‌నగర్‌లో ఆడెపు క్రిష్ణమూర్తి(70) అనే వృద్ధుడు కాలికి గాయమవడంతో వరదనీటి నుంచి బయటకు రాలేకపోయి తాను ఉంటున్న ఇంటిలోనే మృతి చెందాడు. మృతుడి భార్య కొవిడ్ సమయంలో మృతి చెందిం ది. అతడికి పిల్లలు లేరు. ఒక్కడే నివాసముంటున్నాడు. కాగా గురువారం ఉదయం స్థానిక నాయకుడు కేతిరి రాజశేఖర్ చూసి పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

చావుకు వెళ్లి వస్తూ.. వరద నీటిలో గల్లంతు ..



పులి అనిల్(ఫైల్)

ఖిలావరంగల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బంధువు దహన సంస్కారాలకు వెళ్లి వస్తున్న క్రమంలో నగరంలోని మైసయ్యనగర్ వద్ద వరదలో ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. మిల్స్‌కాలనీ పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గీసుగొండ మండలం గుట్టకిందిపల్లి ప్రాంతానికి పులి అనిల్‌కుమార్ (30)బుధవారం రాత్రి తన భార్య మమతతో కలిసి శాకరాసికుంటలో తమ బంధువు దహన సంస్కారాలకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా భారీగా వర్షం కురవడంతో ఖమ్మం రోడ్డు వద్ద తన భార్యను బస్సులో ఎక్కించాడు. ఆయన అదే రోడ్డు గుండా మైసయ్యనగర్ ద్వారా గీసుగొండకు వెళ్తున్న క్రమంలో దారి కనిపించక నీళ్లలో పడి గల్లంతయ్యాడు. మృతుడి భార్య మిల్స్‌కాలనీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వెతుకుతున్న క్రమంలో శివనగర్‌లోని పెద్ద మోరీలో మృతుడి శవం కనిపించింది. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. మిల్స్‌కాలనీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇల్లు కూలి వృద్ధురాలి మృతి



మృతిచెందిన వృద్ధురాలు సూరమ్మ

ఐనవోలు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఇళ్లు కూలి వృద్ధురాలు మృతిచెందిన సంఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం కొండపర్తిలో గురువారం చోటుచేసుకుంది. అదనపు గిర్దావర్ మల్లయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండపర్తి గ్రామానికి చెందిన వృద్ధురాలు గద్దల సూరమ్మ (60) భిక్షాటన చేస్తూ జీవిస్తోంది. పెంకుటింట్లో ఒంటరిగా పడుకొని ఉండగా గురువారం తెల్లవారుజామున ఇల్లు గోడ కూలి అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామస్థులు మట్టిలో కూరుకపోయిన సూరమ్మను బయటికి తీశారు. ప్రాణ నష్టంతోపాటు ఆస్తి నష్టం రూ.1.25 లక్షలు జరిగినట్లు అంచనా వేశారు.

మొట్లతండాలో రైతు గల్లంతు

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కంబాలపల్లి శివారు మొట్లతండా వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగులో రెడ్యాల గ్రామానికి చెందిన పులిగుజ్జు సంపత్ (30) బుధవారం రాత్రి గల్లంతయ్యాడు. ఎన్డీఆర్ఎఫ్, మానుకోట రూరల్ పోలీసులు, గ్రామస్థులు కలిసి వెతకగా మొట్లతండా సమీపంలో గురువారం పొలాల్లో రైతు మృతదేహం లభ్యమైంది. గ్రామస్థులు, రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మండలం రెడ్యాలకు చెందిన పులిగుజ్జు సంపత్ బుధవారం గురిమిళ్ల నుంచి రెడ్యాలకు వస్తున్నాడు. ఈ క్రమంలో కంబాలపల్లి-మొట్లతండా మధ్యలో ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్న వాగులో పడి పోయాడు. ఎంతకు ఇంటికి రాకపోవడంతో సంపత్ కుటుంబ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వాగులో ఒకరు కొట్టుకుపోయారని కంబాలపల్లికి చెందిన ఓ రైతు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గురువారం ఉదయం వారు ఎన్డీఆర్ఎఫ్ బృందంతో కలసి వాగు సమీపంలో వెతికారు. దగ్గరలోని పంట పొలాల్లో సంపత్ మృతదేహం లభ్యమైంది. సంపత్ భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



సంపత్(ఫైల్)

రిటైర్డ్ ఉద్యోగి మృతి



రిటైర్డు ఉద్యోగి శ్రీనివాస్ (ఫైల్)

హనుమకొండ టౌన్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): హనుమకొండ టీవీ టవర్‌కాలనీకి చెందిన పాక శ్రీనివాస్(63) ఇంటి ముందు వరదలో పడి మృతి చెందాడు. గురువారం ఉదయం 10గంటలకు భార్య శ్రీదేవి, కొడుకు శ్రీకాంత్ ఇంట్లో ఉండగా, వరద ప్రవాహం ఇంటిగేటు వద్ద చూస్తుండగా వరదలో పడి మునిగి మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు మృతదేహానికి శుక్రవారం పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వరదలో కొట్టుకుపోయి వ్యక్తి మృతి



అప్పని నాగేంద్రం (ఫైల్)

భీమదేవరపల్లి, (ఎల్కతుర్తి) అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భీమదేవపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అప్పని నాగేంద్రం (58) అనే వ్యక్తి కల్వర్టు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నీటి ప్రవాహంలో చిక్కుకుని మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగేంద్రం హనుమకొండలోని ఓ ప్రైవే టు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో వర్షం మరింత పెరిగింది. దీంతో గ్రామంలోకి వెళ్లే కల్వర్టు పూర్తిగా జలమయమైంది. కల్వర్టు దాటే ప్రయత్నం చేశాడు. ఆయనకు నీటి ప్రవాహం సరిగా కనబడకపోయే సరికి కల్వర్టులో చిక్కుకుని మృతి చెందాడు. మృతుడికి భార్య అనిత, ఇద్దరుకుమారులు ఉన్నారు. అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

అన్నదాత.. గుండె కోత..

● మొంథా తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంటలకు తీరని నష్టం ● కన్నీరుమున్నీరవుతున్న రైతన్న

మొంథా తుఫాన్ అన్నదాతను నట్టేట ముంచింది. అకాల వర్షానికి పంటలన్నీ నేలపాలయ్యాయి. కోతకు దగ్గరపడ్డ వరి నీళ్లలో మునిగిపోయింది. పత్తి దూది తడిసిపోయింది. మొక్కజొన్న పంట ధ్వంసమైంది. ఒక్క రోజులో కురిసిన వర్షానికి రైతులు తీవ్ర నష్టానికి గురయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ములుగులో..



ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో మొంథా తుఫాన్ ప్రభావంతో నేలకొరిగిన వరి పంటను కట్టలు కట్టి నిలబెడుతున్న రైతు

ములుగు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ములుగు జిల్లాలో ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు సగటు వర్షపాతం 4.14 సెం.మీ నమోదైందని అధికారులు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 600 ఎకరాల్లో వరి పంట నేల వాలినట్లు డీఏవోసురేష్ కుమార్ తెలిపారు. అత్యధికంగా గోవిందరావుపేట మండలం, మంగపేట మండలాల్లో వరి పంట నేటకొరిగిందన్నారు. భారీ వర్షం కురవకపోవడంతో పంట నష్టం పెద్ద మొత్తంలో లేదని, ఈదురుగాలులు వల్ల వరి వంగడాలు నేలకొరిగాయని అన్నారు. వాటిని కట్టలు కట్టి ఆరబెడితే ప్రయోజనం ఉంటుందని సూచించారు.



ములుగు జిల్లా వాజేడు మండలంలో నేలవాలిన వరి పంట

జనగామలో..

జనగామ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లావ్యాప్తంగా బుధవారం నాటి తుఫాన్ అన్నదాతకు నష్టాన్ని మిగిల్చింది. భారీ వర్షాలతో జిల్లాలో చాలా చోట్ల వరి, పత్తి పంటలు నీటిమునిగాయి. జిల్లాలో 25816 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఇందులో వరి 1,9131 ఎకరాల్లో, పత్తి 6416ఎకరాల్లో, మొక్కజొన్న 249 ఎకరాల్లో, టమాట, మిర్చి 20ఎకరాల్లో నష్టం జరిగింది. జిల్లావ్యాప్తంగా 142 గ్రామాల పరిధిలోని 9,888 మంది రైతులకు సంబంధించి రైతులు పంటలు నష్టపోయారని అధికారులు గుర్తించారు. చాలా ప్రాంతాల్లో కోతకు వచ్చిన వరి నేలకొరిగి గింజలన్నీ రాలిపోయాయి. మరోవైపు.. తీత దశకు వచ్చిన పత్తి రాలిపోయింది. చెట్టుపై ఉన్న పత్తి కూడా మొలకెత్తే ప్రమాదం ఉంది. కేంద్రాల్లో ధాన్యాన్ని పోసి టార్పాలిన్లు కప్పినప్పటికీ కుప్పల కింద నుంచి వర్షపు నీరు ప్రవహించి ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రాలతో పాటు వ్యవసాయ బావులు, రోడ్ల వెంట పోసుకున్న ధాన్యం సైతం తడిసి ముద్దయింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. గురువారం తెల్లవారుజామునే ధాన్యం కుప్పల వద్దకు రైతులు పరుగులు తీశారు. టార్పాలిన్లు తెచ్చి తడిసిన ధాన్యాన్ని, పొడి ధాన్యాన్ని వేరు చేశారు.



జనగామ మండలం వడ్లకొండ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

భూపాలపల్లిలో..



భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం వజినేపల్లిలో తడిసిపోయిన పత్తి పంట

భూపాలపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో భూపాలపల్లి జిల్లాలోని 12 మండలాల్లో పత్తి పంట తీవ్రంగా దెబ్బతినగా కాటారం, మహదేవపూర్, మహాముత్తారం, పలిమెల, మల్హర్ మండలాల్లో పొట్ట దశలో ఉన్న వరి పంట ఈదురుగాలుల తాకిడికి నేలవాలింది. అయితే.. అధికారికంగా ఎక్కడా ఎలాంటి పంట నష్టం వాటిల్లలేదని అధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ కాటారం సబ్ డివిజన్ పరిధిలోని 500 ఎకరాలకు పైగా వరి పంటకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కాటారం, మహదేవపూర్ మండలాల్లో భారీ వర్షానికి తోడు ఈదురుగాలలు వీచడంతో వరి పంట మొత్తం నేలమట్టమైంది. దీంతో ఆయా మండాల్లో రైతులు గురువారం వర్షం తెరిపినిచ్చిన తర్వాత వాటిని నిలబెట్టే ప్రయత్నాలు చేశారు. మరోవైపు చేతికందే దశలో ఉన్న పత్తి, వర్షం దెబ్బతో పూర్తిగా తడిసిపోవడంతో రంగు మారిందని రైతులు చెబుతున్నారు. జిల్లాలో ఎంత నష్టం వాటిల్లిందనేది అధికారులు సర్వే చేస్తే తప్ప తెలిసే అవకాశం లేదంటున్నారు.

మహబూబాబాద్‌లో..

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ రైతులను తీవ్రంగా నష్ట పరిచింది. భారీ వర్షాలు జిల్లా రైతులను కన్నీటిపాలు చేసింది. చేతికొచ్చిన పంట వానపాలైంది. వరికోత దశలో ఏకధాటిగా కురిసిన వర్షాలతో భారీ నష్టాన్ని మిగిల్చింది. పత్తి పూత, కాత దశలో భారీ వర్షాలు పడి నష్టాన్ని మిగిల్చగా, ఉన్న కొద్దిపాటి పంటను కాపాడుకుందామనుకుంటే అతిభారీ వర్షాలు కురిశాయి. దీంతో రైతులు భారీ మొత్తంలోనే నష్టపోవాల్సి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంటల నష్టాన్ని అంచనా వేయాలని ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా యంత్రాంగం అంచనా వేసేందుకు కదిలారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 217 గ్రామాల్లో 15,614 మంది రైతులకు చెందిన 16,617 ఎకరాల్లో వరికి నష్టం జరిగింది. 8,782 ఎకరాల్లో పత్తి, 65 ఎకరాల్లో మొక్కజొన్న, 565 ఎకరాల్లో మిర్చివెరసి 26,029 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల తెలిపారు. 2408.1 మిల్లీమీటర్ల వర్షపాతం కురియగా, సగటున 150.5 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది.



కేసముద్రం మండలం తౌర్యతండాలో రైతు చంద్రుకు చెందిన నేలవాలిన పత్తి చేలు

వాగులో కొట్టుకుపోయిన ప్రేమజంట



గల్లంతైన యువతి.. ప్రాణాలతో బయటపడిన యువకుడు

స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి జఫర్‌గడ్ వైపు వస్తుండగా ఘటన

యువతి కోసం రెస్క్యూ టీం గాలింపు



ప్రాణాలతో బయటపడిన యువకుడు శివకుమార్

జఫర్‌గడ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం కోనాయిచలం శివారు బోళ్లమత్తడి వాగులో వరద ఉధృతికి ఓ ప్రేమజంట కొట్టుకుపోగా, ఇద్దరిలో బక్క శ్రావ్య (18) గల్లంతు కాగా, ఆమె వెంట ఉన్న బరిగెల శివకుమార్ యువకుడు ఈదుకుంటూ ఒడ్డుకు వచ్చి ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటకు చెందిన బక్క ఆలిసాబ్ - పూర్ణ దంపతులు ముగ్గురు కుమార్తెలు. చిన్నకుమార్తెతో కలిసి 20 ఏళ్లుగా హైద్రాబాద్‌లోని ఓ ఫౌల్ట్రీఫాంలో కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. రెండో కుమార్తె శ్రావ్య వరంగల్‌లోని ఉమెన్ హాస్టల్‌లో ఉంటూ ఖిలావరంగల్ పరిధిలోని బొల్లికుంట వాగ్దేవి కళాశాలలో బీటెక్ ఫస్టియర్ చదువుతోంది. యువతి తల్లిదండ్రులు పనిచేస్తున్న ఫౌల్ట్రీ ఫాంలోనే పని చేస్తున్న రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లికి చెందిన బరిగెల శివకుమార్‌తో శ్రావ్య మధ్య పరిచయం పెరిగి ప్రేమగా మారింది. బుధవారం హైద్రాబాద్ నుంచి బైక్‌పై వచ్చిన శివకుమార్ శ్రావ్య ఉంటున్న హాస్టల్‌కు చేరుకున్నాడు. అక్కడినుంచి తన బైక్‌పై జఫర్‌గడ్ మండలం కోనాయిచలంలోని స్నేహితుడి ఇంటికి శ్రావ్యను తీసుకుని స్టేషన్‌ఘన్‌పూర్, తిమ్మంపేట మీదుగా వస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి 10 గంటల ప్రాంతంలో జఫర్‌గడ్ మండలం బోళ్లమత్తడి వద్ద ప్రధాన బీటీ రోడ్డుపై నుంచి వాగు దాటే ప్రయత్నంలో శివకుమార్- శ్రావ్యలు వరద ఉధృతికి బైక్‌తో సహా వాగులో కొట్టుకుపోయారు. శ్రావ్య గల్లంతు కాగా, శివకుమార్ ఓచెట్టును పట్టుకుని ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకుని ప్రాణాలతో బయటపడ్డాడు. రాత్రి జఫర్‌గడ్ పోలీసుస్టేషన్‌లో ఘటనాసమాచారం తెలుపగా.. వెంటనే పోలీసులు వరంగల్ ఎస్‌ఆర్‌డీఎఫ్ రెస్క్యూటీం సిబ్బందిని ఘటనా స్థలికి రప్పించి గల్లంతైన శ్రావ్య కోసం వాగులో గాలింపు చేపట్టారు. ఘటనా స్థలికి జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ చేరుకుని గాలింపు చర్యలను పరిశీలించారు. వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వెంకన్న నాయక్, సీఐ శ్రీనివాసరావు, జఫర్‌గడ్ ఎస్ఐ రామారావు ఘటనా స్థలి వద్ద గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు. కాగా, సాయంత్రం వరకు యువతి ఆచూకీ లభించలేదు.

మిన్నంటిన రోదనలు



రోదిస్తున్న యువతి కుటుంబీకులు

ఘటనా స్థలి వద్దకు గురువారం చేరుకున్న యువతి తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. కూతురును తలుచుకుంటూ భోరున విలపిస్తుండడం స్థానికులను కంటతడిపెట్టించాయి. తాము జీవనోపాధి కోసం సుమారు 20 ఏళ్ల కిందట హైద్రాబాద్‌కు వెళ్లి ఫౌల్ట్రీ ఫామ్‌లో పని చేసుకుంటూ జీవిస్తున్నామన్నారు. తాము బంధువు అంత్యక్రియల కోసం బుధవారం ఖిలావరంగల్‌కు వచ్చామని, గురువారం ఉదయం కూతురు వాగులో గల్లంతైన విషయం తెలిసిందని తండ్రి అలీసాబ్ విలపిస్తూ చెప్పాడు. శ్రావ్య వరంగల్‌లోని హాస్టల్‌లో ఉంటూ బొల్లికుంట వద్ద గల వాగ్దేవి కళాశాలలో బీటెక్ ఫస్టియర్ చదువుతోందని, అమ్మాయి హైద్రాబాద్‌కు వెళ్లిన విషయం తమకు తెలియదన్నారు.


ఏటిగడ్డతండాలో మునిగిపోయిన వరి పంటను అంచనా వేస్తున్న ఏవో తిరుపతిరెడ్డి


ఉయ్యాలవాడలో వరదనీటిలో మునిగిన పొలాన్ని చూపుతున్న రైతు చింతల వెంకన్న


లక్ష్మీపురంలో వరి పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి అబ్దుల్ మాలిక్

ముంచిన 'మొంథా'

● తుపాన్‌తో చేతి కొచ్చిన పంట నీటిపాలు

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాన్ రైతులను తీవ్రంగా నష్టపరిచింది. భారీ వర్షాలు జిల్లా రైతులను కన్నీటిపాలు చేసింది. చేతికొచ్చిన పంట వానపాలైంది. వరి కోత దశలో ఏకధాటిగా కురిసిన వర్షాలతో భారీ నష్టాన్ని మిగిల్చింది. పత్తి పూత, కాత దశలో భారీ వర్షాలు పడి నష్టాన్ని మిగిల్చగా, ఉన్న కొద్దిపాటి పంటను కాపాడుకుందామనుకుంటే అతిభారీ వర్షాలు కురిశాయి. దీంతో రైతులు భారీ మొత్తంలోనే నష్టపోవాల్సి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంటల నష్టాన్ని అంచనా వేయాలని ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా యంత్రాంగం అంచనా వేసేందుకు కదిలారు.


బయ్యారంలో వర్షానికి నేలవాలిన వరి పంట

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 217 గ్రామాల్లో 15,614 మంది రైతులకు చెందిన 16,617 ఎకరాల్లో వరికి నష్టం జరిగింది. 8,782 ఎకరాల్లో పత్తి, 65 ఎకరాల్లో మొక్కజొన్న, 565 ఎకరాల్లో మిర్చి వెరసి 26,029 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల తెలిపారు. 2408.1 మిల్లిమీటర్ల వర్షపాతం కురియగా, సగటున 150.5 మిల్లిమీటర్ల వర్షపాతం కురిసింది. గూడూరులో అతిభారీ వర్షం 284.2 మిల్లిమీటర్లు, కేసముద్రంలో 276.8 భారీ వర్షపాతంగా నమోదైంది.

ట్రాన్స్‌కోకు నష్టం..

మొంథా తుపాన్ కారణంగా జిల్లాలో 36 విద్యుత్ స్తంభాలు విరిగిపోయి, 10 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిని నష్టం జరిగింది. గూడూరు మండలం మర్రిమిట్ట, బందలగడ్డ తండాలకు వర్షాల కారణంగా నిలిచిన విద్యుత్ సరఫరాను గురువారం సాయంత్రం పునరుద్ధరించారు.

జిల్లాలో వర్షపాతం ఇలా..

జిల్లాలో 2408.1 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా సగటున 150.5 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదు కాగా, గూడూరులో 284.2, కేసముద్రంలో 276.8, కొత్తగూడలో 72.2, గంగారంలో 47.2, బయ్యారంలో 137.2, గార్లలో 146.8, డోర్నకల్‌లో 147.2, కురవిలో 142.2, నెల్లికుదురులో 150.2, నర్సింహులపేటలో 101.6, చిన్నగూడూరులో 96.8, మరిపెడలో 138.4, దంతాలపల్లిలో 116.2, తొర్రూరులో 192.6, పెద్దవంగరలో 188.6 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది.

మండలాల వారీగా నష్టం ఇలా..

మండలం	వరి	పత్తి
బయ్యారం	2488	192
గార్ల	550	100
గంగారం	180	--
గూడూరు	980	190
ఇనుగుర్తి	600	--
కేసముద్రం	1240	--
కొత్తగూడ	1380	--
మహ-బాద్	860	100
నెల్లికుదురు	950	–
చిన్నగూడూరు	210	250
దంతాలపల్లి	1050	1300
డోర్నకల్	1135	1430
కురవి	800	950
మరిపెడ	500	1550
నర్సింహులపేట	418	950
పెద్దవంగర	1546	100
సీరోలు	950	850
తొర్రూరు	780	820
మొత్తం	16,617	8,782

ఆగమాగం

(5వ పేజీ తరువాయి)

ప్రవహిస్తుండడంతో పక్కనే ఉన్న వడ్డెర కాలనీలోకి వరదనీరు చేరడంతో అధికారులు అప్రమత్తమై ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వెంకటగిరి చెరువు అలుగుపోస్తుండడంతో కింద ఉన్న రోడ్డు కొట్టుకుపోయింది. కేసముద్రం-వెంకటగిరి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తౌర్యతండాకు చెందిన చంద్రు పత్తి చేలుకు భారీ నష్టం జరిగింది. తాళ్లపూసపల్లిలో పంటనష్టంకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. నర్సింహులపేట మండలంలో కౌసల్యదేవిపల్లి వద్ద ఆకేరువాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్డీవో గణేష్, తహసీల్దార్ రమేష్, ఎంపీవో కిన్నెర వరద పరిస్థితిని పరిశీలించారు.

తొర్రూరు మండలంలో ఫత్తేపురం వద్ద ఉధృతంగా వరదనీరు ప్రవహిస్తోంది. అమ్మాపురం, బొత్తులతండా, గుర్తూరు, ఈదులకుంట వాగు ఉధృతి ప్రవహిస్తుండడంతో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పరిశీలించారు. ఈ వాగు ఉధృతితో నర్సంపేట-తొర్రూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గూడూరులోని పలు గ్రామాల్లో వరి, పత్తి పంటలు నేలవాలడంతో పలు గ్రామాల్లో వరినీట మునిగాయి. పోతరాజు యాకయ్య, వీరయ్య, కట్టయ్య, సాయిలు, కొమురయ్య, చెన్నయ్యలకు చెందిన 58 గొర్రెలు తుపాన్ ప్రభావంతో మృత్యువాతపడ్డాయి. పలు ఇళ్లు కూలిపోయాయి. పాకాల ఉధృతితో కేసముద్రం-నెక్కొండ మధ్య గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తగూడలో ఎంచగూడ, వెలుబెల్లిలో వరి పొలాలు నేలవాలాయి. పొగుళ్లపల్లి చక్రాలతండలో వరి పొలాలు నీట మునిగాయి. కొత్తగూడ-నర్సంపేట మధ్య గాదెవాగు వద్ద చెట్లు కూలిపోవడంతో పోలీసులు వాటిని తొలగించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారులో మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నర్సంపేటకు రాకపోకలు నిలిపివేశారు. ఈదులపూసపల్లి రాళ్లవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. బూరకుంటతండాలో వరి పొలాలు నేల వాలాయి. గుమ్ముడూరు ఏటిగడ్డ తండా వద్ద వరద నీటిలో మునిగిపోయిన వరి పొలాలను వ్యవసాయాధికారి ఎన్.తిరుపతిరెడ్డి అంచనా వేశారు.

మరిపెడ సీతారాంతండాలో గతంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు నేరవేర్చాలంటూ ధర్నా చేపట్టారు. తహసీల్దార్ కృష్ణవేణి హామీతో ఆందోళన విరమించారు. పురుషోత్తమయగూడెం వద్ద ఆకేరువాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పెద్దవంగరలో వరద నీటిని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పరిశీలించారు. చిట్యాలలో వ్యవసాయాధికారి స్వామి పంటనష్టం అంచనా వేశారు. ఇనుగుర్తిలో 700 ఎకరాల్లో పంటనష్టం జరిగిందని ఏవో మహేందర్ అంచనా వేశారు. కోమటిపల్లి వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్ద 50 ఎకరాల్లో వరిపొలం మునిగిపోయింది. గార్లలో పాకాల వాగు రోడ్డుపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో సత్యనారాయణపురం-గార్లకు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

కురవి మండలంలో వరి పొలాలను వ్యవసాయాధికారి నర్సింహారావు పరిశీలించారు. 450 ఎకరాల్లో వరి, 550 ఎకరాల్లో పత్తికి నష్టం వాటిల్లినట్లు చెప్పారు. తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీవో గౌస్ తెప్పల సాయంతో వాగుదాటి ప్రజలకు కూరగాయలు, నిత్యావసర సరుకులు అందించారు. కాంగ్రెస్ నాయకులు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సహాయ కార్యక్రమాలు జరిగాయి.

గోడకూలి వృద్ధురాలి మృతి


రామక్క (ఫైల్)

గూడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి గాజులగట్టులో గురువారం రాత్రి గోడ కూలి వృద్ధురాలు కోల రామక్క (65) అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్‌ఐ గిరిధర్‌రెడ్డి తెలిపిన ప్రకారం. ఒంటరిగా జీవిస్తున్న రామక్క రాత్రి భోజనం చేసి ఇంట్లో నిద్రించగా మట్టిగోడ కూలి ఆమెపై పడింది. దీంతో రామక్క అక్కడికక్కడే మృతి చెందింది. ఉదయం కుటుంబసభ్యులు గమనించి మట్టిగోడను తొలగించి మృతదేహాన్ని వెలికి తీశారు. ఘటన స్థలాన్ని ఎస్‌ఐ సందర్శించారు. మృతురాలి కుమారుడు మల్లయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

విద్యుత్ పనులను పరిశీలించిన సీఎండీ

గూడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాల నేపథ్యంలో గూడూరు మండలంలో గురువారం ట్రాన్స్‌కో సీఎండీ వరుణ్‌రెడ్డి పర్యటించారు. మండలానికి విద్యుత్ సరఫరా అందించే సబ్‌స్టేషన్లు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. వర్షాలతో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను వెంటనే సరిచేసి సరఫరాను సాధ్యమైంత త్వరితగతిన పునరుద్ధరించాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. మరోవైపు గూడూరు సబ్‌స్టేషన్‌లో కొనసాగుతున్న విద్యుత్ పునరుద్ధరణ పనులను సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ విజేందర్‌రెడ్డి పరిశీలించారు. వారివెంట డివిజనల్ ఇంజనీర్ హీరాలాల్, ఏడీఈ కవిత, సబ్ ఇంజనీరు లక్ష్మణ్ ఉన్నారు.

ఉధృతంగా భీమునిపాదం జలపాతం


కొమ్ములవంచ అటవీ ప్రాంతంలో భీమునిపాదం జలపాతం

గూడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీవర్షాలతో గూడూరు మండలం సీతానాగారం శివారు కొమ్ములవంచ అటవీప్రాంతంలోని భీమునిపాదం జలపాతం ఉధృతంగా దూకుతోంది. సాధారణ సమయాల్లో స్వల్పంగా జాలువారే జలపాతం కింద పర్యాటకులు తడుస్తూ సంతోషాల్లో మునిగితేలేవారు. జలపాతం ఉధృతంగా దూకుతుండడంతో సందర్శకులు దూరం నుంచే జలపాతాన్ని చూసి వెళుతున్నారు. పర్యాటకులు జలపాతం వద్దకు వెళ్లకుండా గూడూరు ఎఫ్ఆర్‌వో సురేష్ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బందిని రక్షణగా ఏర్పాటు చేశారు.

రైతు ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం మాధవపురానికి చెందిన రైతు కంబాల సంపత్ గురువారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు, బంధువులు కథనం ప్రకారం. సంపత్ తన వ్యవసాయ భూమి నుంచి పక్క రైతు గత నాలుగు నెలల క్రితం సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాడు. అప్పటి నుంచి ఇరువురు రైతుల మధ్య వివాదం కొనసాగుతూ వస్తోంది. ఈ క్రమంలో గత నాలుగు రోజుల క్రితం గ్రామంలోని పెద్దమనుషుల సమక్షంలో సీసీ రోడ్డును నిర్మించిన రైతు దానిని తొలగిస్తానని చెప్పి అందులో కొంత రోడ్డును తొలగించాడు. ఈనెల 29న గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు సీసీ రోడ్డును ధ్వంసం చేశారని కురవి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు రైతు సంపత్ అతని తండ్రి సాయిలును పోలీస్‌స్టేషన్‌కు పిలిచారు. దీంతో మనస్థాపానికి గురైన రైతు సంపత్ తన వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అటుగా వెళ్తున్న స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే వారు అతన్ని 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స నందిస్తున్నారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలి : వామపక్ష నేతలు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నల్లచట్టాలను రద్దు చేయాలని, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం చేయాలని ఉద్యమించిన వామపక్ష నేతలపై నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ వెంటనే ఎత్తివేయాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు బి.విజయసారథి, సాదుల శ్రీనివాస్, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నేతలు మండల వెంకన్న, గౌని ఐలయ్య విజ్ఞప్తి చేశారు. నల్లచట్టాల రద్దు, ఆర్టీసీ విలీన ఉద్యమ కేసులో వామపక్ష నేతలు మహబూబాబాద్ జిల్లా కోర్టుకు గురువారం హాజరయ్యారు. బి.అజయ్‌సారథి రెడ్డి, తమ్మెర విశ్వేశ్వరరావు, నల్లు సుధాకర్‌రెడ్డి, ఆకుల రాజు, గునిగంటి రాజన్న, పెరుగు కుమార్, చింత కుంట్ల వెంకన్న, వరిపెల్లి వెంకన్న, మేక వీరన్న, శేఖర్, కుంట ఉపేందర్, హలావత్ లింగ్యా, జగ్గన్న, రాజమౌళి, పాపయ్య, మాధవి, పద్మ, వీరయ్య, సాయిలు, నాగయ్య, మధు, ఉపేందర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వామపక్ష నేతలు

'నిందితులను అరెస్టు చేయాలి'

బయ్యారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : బయ్యారంలో కాంగ్రెస్ నేత నాయిని శ్రీనివాస్‌రెడ్డిపై దాడిచేసి హత్యాప్రయత్నానికి పాల్పడిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. తనపై గత నెల 21న దాడి చేసిన నిందితులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్ రెడ్డి చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం నాలుగో రోజుకు చేరింది. ఈ దీక్షకు బీఆర్‌ఎస్, బీజేపీతో పాటు కాంగ్రెస్‌లోని ఓ వర్గం నేతలు సంఘీభావంగా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వపక్ష నేతలపైనే దాడులు, హత్యాప్రయత్నాలు చేస్తుండటం అవివేకమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన తీరు చూస్తుంటే సామాన్య ప్రజలతో పాటు ప్రతిపక్షాల రక్షణపై సందేహాలు ఏర్పడుతున్నాయన్నారు. ఇలాంటి దాడులు పునరావృతకాకుండా నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షకు మద్దతు తెలిపిన వారిలో బీఆర్‌ఎస్ నేతలు గణేష్, మురళీకృష్ణ, సత్యనారాయణ, లక్ష్మణ్, శ్రీను, ఉదయ్, శోభన్, వీరన్న, సంతప్.. బీజేపీ నేతలు శ్రీనివాస్, రామారావు, చంద్రయ్య, వెంకటేశ్వర్లు, కనకయ్య, కాంగ్రెస్ నేతలు కేతమల్లు, లింగయ్య, విష్ణు, వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, అశోక్ తదితరులున్నారు. కాగా, మద్దతుగా చల్లాగోవర్ధన్ దీక్షలో ఆయన వెంట కూర్చున్నారు. ఇదిలా ఉండగా నాలుగు రోజులుగా శ్రీనివాస్ రెడ్డి చేపడుతున్న దీక్ష రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.


రిలే దీక్షకు మద్దతు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నేతలు

సైన్స్ టాలెంట్ టెస్ట్‌తో ప్రయోజనం

● జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తి


టాలెంట్ టెస్ట్ వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దక్షిణామూర్తి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి) : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏటా పాఠశాలల విద్యార్థులకు నిర్వహించే సైన్స్ టాలెంట్ టెస్ట్‌తో ఎంతో ప్రయోజనం ఉంటుందని డీఈవో దక్షిణామూర్తి అన్నారు. మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న సైన్స్ టాలెంట్ టెస్టు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించే సైన్స్ టాలెంట్ టెస్ట్ వలన విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి పెంపొందుతుందన్నారు. జిల్లాలోని ప్రతీ ఉన్నత పాఠశాలలో సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించడంతో పాటు విద్యార్థులు పాల్గొనేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవీవీ బాధ్యులు సాహితి శ్రీనివాస్, చొప్పరి శ్రీనివాస్, ఆగుర్తి సురేష్, మంగపతిరావు, తడకమల్ల బ్రహ్మం, జంపాల యాకయ్య, నవీన్, డీఎస్వో అప్పారావు, ఎంతవోలు శంకర్, బాలాజీ, మాధవరెడ్డి పాల్గొన్నారు.

యాకన్న స్థూపావిష్కరణ సభ వాయిదా

గూడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మచ్చర్లలో నవంబర్ 3న జరగాల్సిన రాసూరి యాకన్న స్థూపావిష్కరణ సభను నవంబర్ 9కి వాయిదా వేస్తున్నట్లు సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ గూడూరు సబ్ డివిజన్ నాయకులు జోగ రణధీర్ తెలిపారు. భారీ వర్షాల కారణంగా స్థూప నిర్మాణం పూర్తి కాలేదన్నారు. 9న జరిగే రాసూరి యాకన్న స్థూపావిష్కరణ భారీ బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు.

బ్రహ్మణకుంటను పరిశీలించిన ఎమ్మెల్యే

డోర్నకల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాన్ ప్రభావంతో అతలాకుతలమైన డోర్నకల్‌ను ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్ గురువారం రాత్రి సందర్శించి పరిశీలించారు. డోర్నకల్ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే అక్కడ ఉపాధ్యాయులతో మాట్లాడారు. అనంతరం డోర్నకల్ శివారులో బ్రహ్మణకుంటను పరిశీలించారు. ఆయన వెంట డోర్నకల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుబు సుమీర్‌చంద్‌జైన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


బ్రహ్మణకుంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్

బాధితుడికి ఆర్థిక సాయం


తిమ్మాపురంలో ఆర్థిక సాయం చేస్తున్న బిట్ల శ్రీనివాస్

కొత్తగూడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇల్లు కూలిన బాధితుడికి కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్ గురువారం ఆర్థిక సహాయం చేశారు. మొంథా తుపాను వలన కురిసిన భారీ వర్షాలకు తిమ్మాపురం గ్రామానికి చెందిన ఐలబోయిన శ్రీను ఇళ్లు కూలిపోయింది. బిట్ల శ్రీనివాస్ కూలిన ఇంటిని పరిశీలించి, బాధితుడిని పరమార్శించారు. తక్షణ సహాయం కింద రూ.3 వేలు ఆర్థిక సహాయం చేశారు. గట్టి సాంబయ్య, గట్టి సుధాకర్, రమ, దేవేంద్ర పాల్గొన్నారు.

'విద్యార్థుల పరీక్ష ఫీజు రద్దు చేయాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి వార్షిక పరీక్షలకు హాజరుకానున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల పరీక్ష ఫీజు రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చాగంటి ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్‌లో గురువారం జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తికి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం, తెలంగాణ రాష్ట్ర ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరునాయక్, శివనాయక్, భద్రునాయక్, వీరస్వామి, శ్రీనివాస్, పర్వతాలు, యాకూబ్ పాల్గొన్నారు.

'రైతులను తక్షణమే ఆదుకోవాలి'


ధన్నసరిలో పొలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

కేసముద్రం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుపానుతో నష్టపోయిన వరి, మిర్చి, పత్తి రైతులను ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి, ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. ధన్నసరిలో గురువారం ఆయన నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షం కారణంగా వందలాది ఎకరాల్లో పంటలు ధ్వంసమయ్యాయని, ప్రభుత్వం వెంటనే పంట నష్టం సర్వే నిర్వహించాలని కోరారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నజీర్‌అహ్మద్, గుగులోత్ వీరునాయక్, కముటం శ్రీనివాస్, కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, బీర్రు వెంకన్న, బానోత్ వెంకన్న, బానోత్ శ్రీను, బండారు గోపీనాథ్, వంగాల అశోక్, భీమా, గణేష్ ఉన్నారు.

వివిధ సంఘాల ఆధ్వర్యంలో..

నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్) రాష్ట్ర కమిటీ సభ్యుడు మార్తినేని పాపారావు డిమాండ్ చేశారు. కేసముద్రం విలేజిలో పంటలను ఆయన పరిశీలించారు. నీరుటి జలేందర్, ఎండీ పాష, బండారు చిన్నయాదగిరి, సోమారపు ఎల్లయ్య పాల్గొన్నారు. తాళ్లపూసపల్లిలో మునిగిన పంటలను సీపీఎం మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న ఆధ్వర్యంలో పరిశీలించారు. తుపాను బాధిత రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి కోరారు. కేసముద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆవుల కట్టయ్య, పెరుమాండ్ల జానకిరాములు, జంపాల రాంప్రసాద్, మహేష్, సోమయ్య ఉన్నారు.

బతికుండగానే మార్చురీకి తరలించారు...

(5వ పేజీ తరువాయి)

అనారోగ్యానికి గురి కావడంతో పని మానేశాడు. రాజు వారం రోజుల కిందట చికిత్స నిమిత్తం మానుకోట జిల్లా ఆస్పత్రికి వచ్చాడు. అతన్ని పరీక్షించిన వైద్యసిబ్బంది ఆధార్‌కార్డు అడిగారు. లేదని చెప్పడంతో ఇన్‌పేషెంట్‌గా చేర్చుకోవడానికి నిరాకరించారు. దీంతో ఆస్పత్రి క్యాంటిన్ సమీపాన ఖాళీ స్థలంలో ఉంటున్నాడు. రెండు రోజులుగా ఆస్పత్రికి వచ్చిన వారు దయతలచి, ఏదైనా ఇస్తే తిని అక్కడే పడుకునే వాడు. మొంథా తుపాన్ ప్రభావంతో ఆస్పత్రి వద్ద రద్దీ తగ్గిపోయింది. ఆహారం లేక రాజు చలికి ముడుచుకుపోవడంతో పాటు అచేతన స్థితికి చేరాడు. అతడి వద్ద దుర్వాసన వస్తుండడంతో అతడు చనిపోయాడని పొరపడ్డ ఆస్పత్రి సిబ్బంది బుధవారం మార్చురీలో పెట్టేందుకు తీసుకువెళ్లారు. అయితే అక్కడ ఉన్న రెండు బాక్సుల్లో మృతదేహాలుండడంతో ఖాళీ లేక ప్రాంగణంలోని గేట్ వద్ద రాజును ఉంచారు. కాగా, 24 గంటల అనంతరం గురువారం ఉదయం మార్చురీ ఊడ్చడానికి స్వీపర్, సెక్యూరిటీ గార్డు గేట్ తెరవగానే రాజులో కదలికలు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి అతడు బతికున్నాడని నిర్ధారించుకుని ఎమర్జెన్సీ వార్డుకు తరలించారు.

రాజుకు చికిత్స అందిస్తున్నాం..

ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో బతికున్న వ్యక్తిని మార్చురీలో పెట్టారంటూ వస్తున్న వార్తలు అవాస్తవని సూపరింటెండెంట్ డాక్టర్ బత్తుల శ్రీనివాసరావు వివరణ ఇచ్చారు. ఆస్పత్రి సమీపంలో రోడ్డుపై వర్షంలో పడి ఉన్న యాచకుడిని మానవత్వంతో మార్చురీ సెక్యూరిటీ, సిబ్బంది ఆస్పత్రిలో చేర్పించారని తెలిపారు. నడవలేని స్థితిలో ఉన్న రాజును మార్చురీ సిబ్బంది దగ్గరలో ఉన్న బెంచీపైకి చేర్చి అక్కడి నుంచి వార్డుకు మార్చారని, దాన్ని వక్రీకరించి కొంతమంది జిల్లా ఆస్పత్రిపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.

పంట నష్టంపై సర్వే చేయాలి : న్యూడెమోక్రసీ

గార్ల, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాన్‌లో నష్టపోయిన వరిపంట భూములను రాష్ట్రప్రభుత్వం తక్షణమే జర్వే జరిపి ఆదుకోవాలని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి జి.సక్రు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికి వచ్చే సమయంలో ప్రకృతి కన్నెర్ర చేసి, తీరని నష్టం మిగిలిచ్చిందన్నారు. అదే విధంగా తేమశాతం కోసం కల్లాల్లో ఆరబోసిన వరిధాన్యం తడిసి ముద్దకావడం జరిగిందని, వీటిని ప్రభుత్వం నేరుగా కోనుగోలు చేయాలన్నారు. 149 లక్షల టన్నుల ధాన్యం కోనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతుందన్నారు. మిగతా పంటను మిల్లర్స్ కోనుగోలు చేస్తారామో రైతులకు అర్థం కావడం లేదన్నారు. జడ సత్యనారాయణ, వీరభద్రం, మాన్యనాయక్, గణేష్, భద్రాజీ, మనోహర్, గోళ్ల మాధవరావు, అంగోత్ మాంగ్యా, మల్లేశం పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ శారదకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందచేశారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పద్మశ్రీ మందకృష్ణమాదిగ పిలుపు మేరకు దళితుల ఆత్మగౌరవ ప్రదర్శనకు నవంబర్ 1న జరుపతలపెట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని దివ్యాంగులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారంనిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ మండలం నుంచి దివ్యాంగులు అధిక సంఖ్యలో తరలివచ్చేలా దళితుల మహా ప్రదర్శనకు మద్దతనివ్వాలన్నారు. ఎమ్మెస్పీ జాతీయ నాయకులు గుగ్గిళ్ల పీరయ్య, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చలగోల వెంకన్న, జిల్లా అధ్యక్షుడు ఎండి.పాష, కందిపాటి బిక్షపతి, బైగల్ల సహాదేవుడు, జేరిపోతుల నారాయణ, కొండ వెంకటేశ్వర్లు, మొలుగూరి కుమార్, శామకూరి రాంబాబు, గుళ్ల శ్రావణ్, నవీన్ పాల్గొన్నారు.